క్లుప్తంగా

చౌడేశ్వరిదేవిని దర్శించుకున్న ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి



అమ్మవారి ఆలయంలో ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి

బనగానపల్లె రూరల్ : మండలంలోని నందవరం గ్రామంలో వెలసిన శ్రీ చౌడేశ్వరిదేవిని మంగళవారం ఎంపీ పోచాబ్రహ్మానందరెడ్డి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి కుంకుమార్చన, అభిషేకం తదితర పూజలు చేశారు.

వాహనాల తనిఖీ



నొస్సం చెక్‌పోస్ట్ వద్ద వాహనం డిక్కీని పరిశీలిస్తున్న సీఐ జయచంద్ర

సంజామల: మండల పరిధిలోని నొస్సం గ్రామ వద్ద ఏర్పాటు చేసిన అంతర్ జిల్లా చెక్‌పోస్ట్ వద్ద ఎస్ఐ రమేష్ రెడ్డితో కలసి సీఐ జయచంద్ర మంగళవారం వాహనాల తనిఖీ నిర్వహించారు. జమ్మలమడుగు, కోవెలకుంట్ల, బనగానపల్లె, నంద్యాలకు వెళ్లే వాహనాలను ఆపి క్షుణ్ణంగా పరిశీలించారు. సరైన రికార్డులు లేని వాహనచోదకులకు జరిమానా విధించారు. అప్రమత్తంగా ఉండాలని సిబ్బందికి సీఐ సూచించారు.

వైభవంగా హనుమాన్ శోభాయాత్ర



శోభా యాత్రలో పాల్గొన్న విశ్వహిందూ పరిషత్ సభ్యులు, భక్తులు

డోన్ టౌన్ : హనుమాన్ జయంతిని పురస్కరించుకొని మంగళవారం విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో శ్రీవీర హనుమాన్ విజయ శోభాయాత్ర అంగరంగ వైభవంగా సాగింది. పట్టణ సమీపంలోని ప్రభుత్వ ఐటీఐ వద్ద ఉన్న ఆంజనేయస్వామి దేవాలయం నుంచి ప్రారంభమైన శోభ యాత్ర ప్రధాన రహదారి మీదుగా కొత్త బస్టాండ్, ఇందిరానగర్, పాత బస్టాండ్ మీదుగా నిర్వహించారు. జై హనుమాన్... జై శ్రీరాం నినాదాలు హోరెత్తాయి.

ఘనంగా శ్రీ చౌడేశ్వరిదేవి పల్లకీ సేవా



శ్రీ చౌడేశ్వరిదేవి పల్లకీ సేవా కార్యక్రమంలో పాల్గొన్న కాటసాని కాటసానిజయమ్మ

బనగానపల్లె రూరల్ : మండలంలోని నందవరం గ్రామంలో వెలసిన శ్రీ చౌడేశ్వరిదేవి ఆలయంలో ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి సతీమణి కాటసాని జయమ్మ ఆధ్వర్యంలో మంగళవారం 108 మహిళా భక్తులతో సహస్ర కుంకుమార్చన చేశారు. పౌర్ణమి రోజు కావడంతో సంప్రదాయబద్ధంగా సహస్ర కుంకుమార్చన పూజలు నిర్వహించారు. సాయంత్రం ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో శ్రీ చౌడేశ్వరిదేవి ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేకంగా పల్లకిలో ముస్తాబు చేశారు. అనంతరం కాటసాని జయమ్మ ప్రత్యేక పూజలు చేసి పల్లకీ సేవలో భక్తులతో కలిసి పాల్గొన్నారు.

26 నుంచి విగ్రహ ప్రతిష్ఠ పూజలు

కొలిమిగుండ్ల: మండల పరిధిలోని బెలుంలో జీర్ణోద్ధరణ చేసిన మారెమ్మ, సత్యమ్మ ఆలయాల్లో ఈనెల 26 నుంచి మూడు రోజుల పాటు విగ్రహ ప్రతిష్ఠ పూజలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. వేదపండితుల ఆధ్వర్యంలో 28న మారెమ్మ,సత్యమ్మ, నాభిశిల ప్రతిష్ఠ చేస్తామన్నారు. భజన కార్యక్రమాలు, అన్నదానం ఏర్పాటు చేశామన్నారు.

హనుమద్ వాహనంపై శ్రీదేవి,భూదేవి సమేత చెన్నకేశవస్వామి

బేతంచెర్ల : పట్టణ ప్రజల ఆరాధ్యదైవంగా వెలుగొందుతున్న చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవస్వామిని హనుమద్వాహనంపై మంగళవారం గ్రామ పురవీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు. ఆలయం నుండి మేళతాళాలు, భక్తుల మధ్య అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించిన పూల రథంలో ఊరేగించారు.

వైభవంగా చెన్నకేశవస్వామి కల్యాణం

శ్రీదేవి,భూదేవి సమేత చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలో భాగంగా మంగళవారం ఉదయం స్వామి అమ్మవార్లకు వేదపండితులు మంత్రాలు చదువుతుండగా కళ్యాణం వైభవంగా నిర్వహించారు. ఆలయ ఈఓ మద్దిలేటి ఆధ్వర్యంలో వేద పండితులు వేద మంత్రాలు చదువుతుండగా ఈవీ మారుతి కృష్ణ, భార్గవి దంపతులు, ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించి శాస్త్రోకంగా పూజలు నిర్వహించి కల్యాణం జరిపించారు. ఆలయ మాజీ చైర్మన్ గుండా జగన్, పట్టణ ప్రముఖులు బుగ్గన శ్రీధర్‌రెడ్డి, గౌరి హుసేన్‌రెడ్డి, బుగ్గన విశ్వనాథ్‌రెడ్డి, అన్నరావు, నాగమోహన్, బూషిరెడ్డి పాల్గొన్నారు.

అభివృద్ధి చేశాం.. ఆదరించండి

- డోన్‌ను మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దాం
- పట్టణాలతోపాటు గ్రామాల రూపురేఖలు మార్చేశాం
- మారుమూల పల్లెల్లో సైతం మౌలిక వసతులు కల్పించాం
- ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి



హనుమాన్ నగర్‌లో బత్తాయి పండ్ల దండతో మంత్రి బుగ్గనను సత్కరిస్తున్న దృశ్యం

బేతంచెర్ల: ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు డోన్‌ను మోడల్ నియోజకర్గంగా తీర్చిదిద్దామని, ఇంకా మెరుగుపరిచేందుకు మరో మారు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి ప్రజలను కోరారు. పట్టణాలతోపాటు గ్రామాల రూపురేఖలు మార్చామని, మారుమూల పల్లెలకు సైతం మౌలిక వసతులు కల్పించామని గుర్తు చేశారు. మంగళవారం పట్టణంలోని శేషారెడ్డి నగర్, మహాత్మాగాంధీ నగర్, హనుమాన్‌నగర్, సంజీవనగర్, జంగాలపేట కాలనీల్లో నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి, కౌన్సిలర్స్ చింతల నాగిరెడ్డి, ఇబ్రహిమ్, నాగజ్యోతి, మహేశ్వరీ ఆధ్వర్యంలో మంత్రి బుగ్గన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మంత్రి బుగ్గనకు ఆయా కాలనీల ప్రజలు, అభిమానులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా స్వాగతం పలికారు. మహిళలు మంత్రికి హారతులుపట్టి, తిలకందిద్ది స్వాగతించారు. ప్రజలకు అభివాదం చేస్తూ ప్రతిఒక్కరినీ ఆప్యాయంగా పలుకరిస్తూ మంత్రి ముందుకు సాగారు. మంత్రిని పలుకరించేందుకు, కరచాలం చేసేందుకు యువకులు పోటీపడ్డారు. ప్రజలు పెద్దఎత్తున తరలిరావడంతో ఆయా కాలనీలు కిక్కిరిసిపోయాయి. మదర్‌సా గురువు ముఫ్తి అజ్మతుల్లా మౌలానా మంత్రి బుగ్గనకు అల్లా అనుగ్రహం, ప్రజల ఆశీర్వాదంతో గెలుపొందాలని ప్రార్థనలు చేశారు. బేతంచెర్ల పట్టణంలో 40 సంవత్సరాలకుపైగా ఉన్న తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిన మహోన్నత వ్యక్తి బుగ్గన అని కొనియాడారు. ముస్లిం పెద్ద సుభహాన్ మంత్రి బుగ్గనను సౌది రాజకిరీటంతో సత్కరించి, మాక్కా పవిత్ర జలాన్ని అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ, స్టేట్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరక్టర్లు ముర్తుజావలి, ఖాజ హుసేన్, గిడ్డంగుల శాఖ డైరక్టర్ బాబుల్ రెడ్డి, వాల్మీకి ఫెడరేషన్ డైరక్టర్ మురళీ, వైఎస్సార్‌సీపీ నాయకులు బుగ్గన చంద్రారెడ్డి, లక్ష్మిరెడ్డి, గుని నాగరాజు, నాగేశ్వర్‌రెడ్డి ,జీసీ వెంకట్, డక్కి శేఖర్, శేకరయ్య, నిరంజన్, మధుసూధన్‌రెడ్డి, కృష్ణమూర్తి, నాగరాజు, మల్లీ, నాగార్జున, కిరన్, వలీబాషా, తిరుమలేశ్వర్‌రెడ్డి, అజామ్, బుగ్గన రమణారెడ్డి, భాస్కర్‌రెడ్డి,బూషిరెడ్డి,మునిస్వామి, పవన్, పిట్టల జాకీర్, సలీమ్, ఖాజా, వైస్ చైర్మన్ నాగ వెంకటేశ్వర్లు, వైస్ ఎంపీపీ రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.

ప్రజల ఆశీర్వాదంతోనే అన్నిరంగాల్లో డోన్‌ను అభివృద్ధి చేశా...

ప్రజల ఆశీర్వాదంతోనే డోన్ నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేయగలిగానని మంత్రి బుగ్గన స్పష్టం చేశారు. కేవలం ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో సీఎం జగన్ సహకారంతోనే నలభై ఏళ్ల అభివృద్ధి సాధించామన్నారు. అందరూ సుఖసంతోషాలతో జీవనంసాగించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఆ దిశగా సీఎం వైఎస్ జగన్ ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేశారని, ప్రజల వద్దకే పాలన సాగించారన్నారు. పేదల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా సక్షేమ పథకాలు అమలు చేశారన్నారి చెప్పారు. పాలనలో విప్లవాత్మక మార్పులు తీసుకవచ్చి వలంటీర్ల ద్వారా వృద్ధులు, వికలాంగులు, వితంతువులకు పింఛన్ అందజేయడమే కాకుండా, మహిళల సంక్షేమానికి వైఎస్సార్ ఆసరా, చేయూత, సున్నా వడ్డీ తదితర పథకాలు అమలు చేశారన్నారు. కులమతాలకు అతీతంగా అన్ని వర్గాల సంక్షేమానికి తోడ్పడిని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి ప్రజలు అండగా నిలువాలని పిలుపునిచ్చారు. మే 13 రెండు బటన్‌లు నొక్కి తనతోపాటు ఎంపీగా పోచా బ్రహ్మనందరెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు.



ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రజలకు అభివాదం చేస్తున్న ఆర్థిక మంత్రి బుగ్గన



బుగ్గన విజయాన్ని కాంక్షిస్తూ ప్రార్థనలు చేస్తున్న ముస్లిం సోదరులు

ఆకట్టుకున్న చిన్నారుల కోలాటం



సీఎం వైఎస్ జగన్ పాటకు చిన్నారులు చేస్తున్న కోలాటాన్ని తిలకిస్తున్న మంత్రి బుగ్గన

ఎన్నికల ప్రచారంలో భాగంగా హనుమాన్ నగర్, సంజీవనగర్ కాలనీల్లో పర్యటించిన మంత్రి బుగ్గనకు మహిళలు ఘనంగా స్వాగతం పలికారు. సంజీవనగర్ కాలనీ చిన్నారుల కోలాటం ఆకట్టుకుంది. 'ఇచ్చిన మాట తప్పితే ఓటు... వేయొద్దని చెప్పిన దమ్మున్నోడు జగన్' పాటకు చిన్నారులు ప్రదర్శించిన కోలాటం అందరినీ కట్టిపడేసింది. మంత్రి బుగ్గన సైతం కోలాటాన్ని ఆసక్తిగా తిలకించారు. చిన్నారులు కోలాట నృత్యానికి లయబద్ధంగా చూపరులు సైతం గొంతు కలిపారు. ఈ సదర్భంగా చిన్నారులను మంత్రి అభినందించారు. అదేవిధంగా హనుమాన్ నగర్ యువకులు క్రేన్‌తో బత్తాయి పండ్లతో తయారుచేసిన గజమాలవేసి సత్కరించారు. జైజగన్... జైజైబుగ్గన నినాదాలతో ఆప్రాంతం హోరెత్తింది.

వైభవంగా శ్రీలక్ష్మీ కంబగిరిస్వామి కల్యాణం



స్వామివారి కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు



కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

అవుకు(కొలిమిగుండ్ల): అవుకు మండల కేంద్రానికి 20 కి.మీ దూరంలో ఎర్రమల కొండల్లో వెలసిన శ్రీలక్ష్మీ కంబగిరి స్వామి కల్యాణం మహోత్సవం మంగళవారం వైభవంగా జరిగింది. ఆలయ ధర్మకర్త చల్లా సూర్యప్రకాష్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి చేయగా భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి స్వామివారి కల్యాణాన్ని వీక్షించారు. జక్కలేరువాగు ఒడ్డున ఉడుము రూపంలో వెలసిన లక్ష్మీ కంబగిరిస్వామిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలిరావడంతో ఆలయ పరిసరాలు కిక్కిరిసి పోయాయి. స్వామికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం అశేష భక్త జనుల మధ్య రథోత్సవం నిర్వహించారు. భక్తుల సౌకర్యం కోసం డోన్, బనగానపల్లె ఆర్టీసీ డిపోలు నుంచి ప్రత్యేక బస్సు సర్వీసులు ఏర్పాటు చేశారు.

వైఎస్సార్‌సీపీ విజయం తథ్యం



ప్రచారం నిర్వహిస్తున్న చల్లా విఘ్నేశ్వర్‌రెడ్డి

అవుకు(కొలిమిగుండ్ల): త్వరలో జరగబోవు ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయం తథ్యమని వైఎస్సార్ సీపీ ముఖ్య నాయకులు చల్లా విఘ్నేశ్వర్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆరవ రోజు ఉప సర్పంచ్ చల్లా రఘునాథ్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకుడు పోతిరెడ్డి శ్రీనివాసులరెడ్డితో కలిసి మండల కేంద్రం అవుకులో ఆయన ఎన్నికల ప్రచారం చేశారు. ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేసిన అభివృద్ధిని వివరిస్తూ కరపత్రాలు అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందజేసిన ఘనత సీఎం జగన్ మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. మే13న ఫ్యాన్ గుర్తుకు ఓటేసి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు కాటసాని రామిరెడ్డి, పోచా బ్రహ్మనందరెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన ప్రజలను కోరారు.

వలంటీర్ల రాజీనామా

కోవెలకుంట్ల: కోవెలకుంట్ల మండలంలోని వివిధ గ్రామ సచివాలయాల పరిధిలో పనిచేస్తున్న 10 మంది వలంటీర్లు మంగళవారం రాజీనామా చేశారు. జోళదరాశికి చెందిన ఆరుగురు, సౌదరదిన్నెలో ఇద్దరు, కోవెలకుంట్ల-2, 4 సచివాలయాల పరిధిలో ఇద్దరు రాజీనామా చేశారు. ఈ మేరకు రాజీనామా పత్రాలను ఎంపీడీఓ సయ్యదున్నీసాకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వలంటీర్లు రాజకీయ కార్యక్రమాల్లో పాల్గొనకూడదని ఎన్నికల కమిషన్ ఆదేశాలు ఉండటంతో స్వచ్ఛందగా ఆ పోస్టులకు రాజీనామా చేశామన్నారు. ఒకవైపు ప్రచార కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొని వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల గెలుపుకు కృషి చేస్తామని పేర్కొన్నారు.



ఎంపీడీఓకు రాజీనామా పత్రాన్ని అందజేస్తున్న వలంటీర్లు

సంజామల: మండలంలోని సచివాలయాల పరిధిలో పనిచేస్తున్న 20 మంది వలంటీర్లు రాజీనామా చేశారు. ఈ మేరకు మంగళవారం రాజీనామా పత్రాన్ని ఎంపీడీఓ నాగకుమార్‌కు అందజేశారు. ఇప్పటి వరకు మొత్తం 54 మంది వలంటీర్లు రాజీనామా చేశారని ఎంపీడీఓ తెలిపారు.

వాసవీ ప్రతిభ అవార్డు దరఖాస్తు చేసుకోండి

డోన్ టౌన్ : పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో 500 మార్కులు పైగా సాధించిన డోన్ పట్టణంలో చదివిన విద్యార్థులకు ఆవోపా సంఘం ప్రతిభ అవార్డు అందివ్వనున్నట్లు ఆ సంఘం ప్రధాన కార్యదర్శి జోన్నల గడ్డ శ్రీనివాసుల శెట్టి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 30వ తేదీ లోపల విద్యార్థుల మార్కు లిస్టు, పేరు, గోత్రం, తల్లిదండ్రుల పేర్లు, చదివిన స్కూల్ వివరాలు,సెల్ నెంబర్ తదితర వివరాలు స్వయంగా, వాట్సాప్ ద్వారా ఆవోపా సంఘానికి చేరవేయాలన్నారు. వివరాలకు, దరఖాస్తులు పంపడానికి 9441656609, 9346289022 సంప్రదించాలన్నారు.

నేడు నామినేషన్ల సందర్భంగా ట్రాఫిక్ నిబంధనలు

బనగానపల్లె రూరల్ : బనగానపల్లె పట్టణంలో బుధవారం వైఎస్సార్‌సీపీ, టీడీపీ అభ్యర్థుల ఎన్నికల నామినేషన్ల సందర్భంగా ట్రాఫిక్ ఆంక్షలు విధించినట్లు ఎస్ఐ రామిరెడ్డి మంగళవారం తెలిపారు. బనగానపల్లె పట్టణంలోని వచ్చే సిమెంట్ లారీలు, ట్యాంకర్లు, ఇతర భారీ వాహనాలు పట్టణంలోకి ప్రవేశం లేదన్నారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ట్రాఫిక్ ఆంక్షలు ఉంటాయని, వాహనచోదకులు సహకరించాలని ఎస్ఐ కోరారు.

విద్యుదాఘాతంతో కార్మికుడి మృతి

ప్యాపిలి: మండల పరిధిలోని వెంగళాంపల్లి గ్రామానికి చెందిన గోపాల్ (43) మంగళవారం విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. భవన నిర్మాణ కార్మికుడైన గోపాల్ అదే గ్రామంలో ఓ ఇంటి నిర్మాణ పనుల్లో ఉండగా ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలు తగిలాయి. దీంతో అక్కడికక్కడే కుప్పకూలాడు. అక్కడే ఉన్న స్థానికులు వెంటనే అతన్ని డోన్ ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు డోన్ వైద్యులు తెలిపారు. మృతి చెందిన గోపాల్‌కు భార్య రమణమ్మ, ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఈ విషయంపై ఫిర్యాదు అందలేదని ప్యాపిలి పోలీసులు తెలిపారు.

పావనిని అభినందించిన మంత్రి బుగ్గన

బేతంచెర్ల : పట్టణంలోని సంజీవనగర్ కాలనీకి చెందిన మధు పావని 10వ తరగతి ఫలితాల్లో 600 మార్కులకు గాను 590 మార్కులు సాధించింది. ఈసందర్భంగా ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి బుధవారం విద్యార్థిని మధు పావనికి స్వీట్ తినిపించి అభినందించారు.ఉన్నత లక్ష్యంతో చదవాలని విద్యార్థికి మంత్రి బుగ్గన సూచించారు.

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం

బనగానపల్లె రూరల్ : స్థానిక కస్బా, తెలుగుపేట ఎంపీపీ పాఠశాలల్లో హెచ్‌ఎంలు సుంకన్న, ఎస్ ప్రతాప్ ఆధ్వర్యంలో పాఠశాలల వార్షికోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఈ నెల 30న పదవీ విరమణగా పొందనున్న తిమ్మాపురం ఎంపీపీ స్కూల్ హెచ్‌ఎం పుల్లయ్యను ఎంఈఓ ఎంఈఓ స్వరూపతో పాటు ఉపాధ్యాయనీ, ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈఓ-2 శ్రీనివాసులు, ఉపాధ్యాయులు సత్యప్రకాష్, అబ్దుల్‌కలీం, పుష్పలత, కృష్ణయ్య, సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

మోడల్ స్కూల్ విద్యార్థులకు అభినందనలు

డోన్ టౌన్ : ఇంటర్, పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరచి స్కూల్‌కు మంచి గుర్తింపు తెచ్చిన విద్యార్థులకు మంగళవారం పట్టణ సమీపంలోని మోడల్ స్కూల్ ఆవరణలో ప్రిన్స్‌పాల్ జాస్మిన్ అధ్యక్షతన అభినందన సభ నిర్వహించారు. ఇంటర్ ఎంపీసీ విభాగంలో విజిత్ 965, జాహ్నవి 930, టి.దివ్య 909, బైపీసీ విభాగంలో గాయత్రి 929, త్రివేణి 926, సీఈసీ విభాగంలో ముషారాఫ్ 897, ప్రణతి 888 సాధించారు. అదేవిధంగా పది ఫలితాల్లో సుదర్శన్ 588, అనుశ్రీ587, మౌనిక 584, జోగేశ్వర్, 581,అనిత 580, శశాంక్ 580, కీర్తన 577, దివాకర్ 577, ప్రియాంక 574, సుశాంత్ 573 సాధించినవారితోపాటు 500 పైగా మార్కులు తెచ్చుకున్న మరో 55 మందిని ఉపాధ్యాయులు అభినందించారు.

చెరువుపల్లె గ్రామంలో టీడీపీ ఖాళీ





ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన చెరువుపల్లె గ్రామస్తులు, లింగాల గ్రామస్తులు

బనగానపల్లె రూరల్ : మండలంలోని చెరువుపల్లె గ్రామంలో టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి వలసల పరంపర కొనసాగుతునే ఉంది. మంగళవారం 15 టీడీపీ కుటుంబాలు ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరడంతో ఆ గ్రామంలో టీడీపీ ఖాళీ అయ్యింది. చెరువుపల్లెకు నంద్యాల హుస్సేన్‌బాషా, డిష్ సుభాన్, అభిమన్యుడు, మాసుమ్‌గారి సన్నన్న మాబాషా, సుద్దలప్రసాద్, మౌలాలి, రాచర్ల మాబాషా, దస్తగిరి చాకలిచంద్రుడు, హుస్సేన్‌బాషా, మేకలశీలయ్య, హజరత్ అబ్బాస్, మద్దెన్నగారి హుస్సేన్‌బీ, గుండ్లకుంట రాంపుల్లయ్య మనోహర్ తదితరులు టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాటసాని చెరువుపల్లె గ్రామంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో పార్టీ, కులమతాలకు అతీతంగా సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి చేకూరడం జరిగిందన్నారు. ఈ పథకాలకు ఆకర్షితులై టీడీపీ వీడి వైఎస్సార్‌సీపీలోకి చేరుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో చెరువుపల్లె గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులు పుల్లయ్య,సూర్యనారాయణ రెడ్డి, నాగయ్య,రామసుబ్బయ్య,గొల్లరామకృష్ణుడు గడ్డలబాషా తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరిన లింగాల గ్రామస్తులు

బనగానపల్లె రూరల్ : కోవెలకుంట్ల మండలం లింగాల గ్రామానికి చెందిన 30 టీడీపీ కుటుంబాలు ఆ పార్టీని వీడి ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. స్థానిక ఎమ్మెల్యే స్వగృహంలో జరిగిన ఈ కార్యక్రమంలో సోమేశ్వరస్వామి ఆలయ మాజీ ధర్మకర్త నుసి వెంగళరెడ్డి, నరసింహారెడ్డి, నుసి ప్రహల్లాదరెడ్డి, నుసి సంజీవ రెడ్డి, నుసి నరసింహారెడ్డి, గుంజలపల్లె రామపుల్లారెడ్డి, తలారి భూపాల్, మల్లు రామచంద్రారెడ్డి, బుడమకాయాల వెంకటేశ్వరరెడ్డి, తోముల రామకృష్ణ, చాకలిశివ, గుండి ఓబులేసు, తలారివెంకటేష్, తలారి బాలుడు,ఉసు రాముడు, జనార్ధన్‌గౌడ్, ఎద్దులశ్రీను, చాకలిమనోహర్, దూదేకుల దేవ ఉసేని, తలారివెంకటరమణ, ఈర్ల సుబ్బరాయుడు, తలారి డ్రైవర్ నారాయణ, చాకలి మధుశేఖర్, చాకలిపవన్, చాకలిశివయ్య తదితరులు వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి ఎమ్మెల్యే కాటసాని వైఎస్సార్‌సీపీ కండువావేసి సాదరంగా ఆహ్వానించారు. వైఎస్సార్‌సీపీ విజయానికి అంకితభావంతో కృషి చేయాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే సూచించారు. సీఎం వైఎస్ జగన్ పాలనలో కులమతాలకు అతీతంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందడం జరిగిందన్నారు. ప్రజల వద్దకే పాలన కొనసాగించేందుకు మరోమారు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో లింగాల గ్రామ మాజీ సర్పంచ్ డివిశేషిరెడ్డి, వైవీ శేషిరెడ్డి, సోమేశ్వరస్వామి ధర్మకర్త బుడుమకాయల బ్రహ్మానందరెడ్డి, వై వెంగళరెడ్డి, బైరెడ్డి సుధాకర్‌రెడ్డి, దండే రమణారెడ్డి, భీమిరెడ్డి చంద్రారెడ్డి, బీమిరెడ్డి రామపుల్లారెడ్డి, ఎన్ సుధాకర్‌రెడ్డి ఎస్ నాగేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఐదుగురు అభ్యర్థులు నామినేషన్

బనగానపల్లె రూరల్ : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మంగళవారం ఐదుగురు అభ్యర్థులు తమ నామినేషన్ పత్రాలు అందజేశారని ఆర్‌ఓ కామేశ్వర రావు తెలిపారు. కేడం సుబ్బరాయుడు, గోపాజీ సుబ్బరాయుడు, కె.రఘునాథ్‌రెడ్డి, పోతిరెడ్డి వెంకటసుబ్బారెడ్డి ఇండిపెండెంట్ అభ్యర్థులుగా, బహుజన పార్టీ అభ్యర్థిగా జి చెన్నయ్య నామినేషన్ పత్రాలు అందజేశారన్నారు.


రెండు నామినేషన్ల దాఖలు

డోన్ టౌన్ : డోన్ అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థులుగా మంగళవారం నాల్గవ రోజు ఇద్దరు తమ నామినేషన్లు దాఖలు చేసినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి మహేశ్వరరెడ్డి తెలిపారు. స్వతంత్ర అభ్యర్థిగా పట్టణానికి చెందిన సీనియర్ పాత్రికేయుడు శివరామయ్యఆచారి, భారత చైతన్య యువజన పార్టీ తరుపున బాల సుబ్బయ్య నామినేషన్ వేశారన్నారు.

నేడు ప్యాపిలి మండలంలో మంత్రి బుగ్గన ప్రచారం

ప్యాపిలి: ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి బుధవారం ప్యాపిలి మండలంలో ప్రచారం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల నాయకులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బావిపల్లి, ఎస్ రంగాపురం, కలచట్ల, ఎస్ రంగాపురం తదితర గ్రామాల్లో మంత్రి ఎన్నికల ప్రచారం చేస్తారన్నారు. వైఎస్సార్‌సీపీ శ్రేణులు, అభిమానులు తరలిరావాలని పిలుపునిచ్చారు.

ప్రతిభ చాటిన విద్యార్థులకు నగదు పురస్కారం



విద్యార్థినికి నగదు అందజేస్తున్న నరసింహా చౌదరి

ప్యాపిలి: పదో తరగతి పరీక్షల్లో ప్రతిభ చాటిన విద్యార్థులకు పూర్వ విద్యార్థి మంగళవారం నగదు పురస్కారం అందించారు. మండల పరిధిలోని పీఆర్ పల్లి ఉన్నత పాఠశాలకు చెందిన అమృత 567, భాష్యం రేవతి 529 మార్కులు సాధించారు. పీఆర్ పల్లి ఉన్నత పాఠశాల పూర్వవిద్యార్థి, నల్లమేకలపల్లి గ్రామ నివాసి తమ్మినేని చంద్రశేఖర్ మహబూబ్ నగర్‌లో ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్నాడు. ఈ మేరకు ఎస్ఐ తండ్రి మంగళవారం అమృత, భాష్యం రేవతికి ఒక్కొక్కరికి రూ. 5 వేలు చొప్పున అందజేశారు.

విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పులు



ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

బనగానపల్లె : విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోమారు ఆశీర్వదించాలని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక నెహ్రూ విద్యా సంస్థల ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశానికి ఎమ్మెల్యే కాటసాని హాజరై మాట్లాడారు. విద్యార్థుల భవిష్యత్తుకు పునాదులు వేసే ఉపాధ్యాయులు అభివృద్ధికి పాటుపడేవారిని ఎన్నుకోవాలని కోరారు. బనగానపల్లె నియోజకవర్గాన్ని అన్నివిధాలుగా అభివృద్ధి చేశామని, మరింత చేసేందుకు అవకాశం కల్పించాలని విన్నవించారు. కరోనా కష్ట కాలంలోనూ సంక్షేమ పథకాలు అమలు చేసిన సీఎం జగన్‌ను ఆదరించాలన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో తనతోపాటు ఎంపీ పోచా బ్రహ్మనందరెడ్డిని అత్యధిక మెజారీతో గెలిపించాలని ఎమ్మెల్యే కాటసాని కోరారు. కార్యక్రమంలో అవుకు మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ కాటసాని తిరుపాల్‌రెడ్డి, నాయకులు కోడూరు రామచంద్రారెడ్డి, అంబటి రవికుమార్ రెడ్డి, స్కూల్ డైరెక్టర్లు కోడూరు కమల్‌తేజారెడ్డి, కోడూరు రవితేజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

కోవెలకుంట్ల: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో శాంతిభద్రతలకు విఘాతం కల్గిస్తే కఠిన చర్యలు తప్పవని కోవెలకుంట్ల సీఐ జయచంద్ర హెచ్చరించారు. మే 13న జరిగే ఎన్నికల పోలింగ్‌ను పురస్కరించుకుని మంగళవారం రేవనూరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని కలుగొట్ల గ్రామంలో ఓటు వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును ప్రతి ఒక్కరూ స్వేచ్ఛాయుత వాతావరణంలో వినియోగించుకోవాలన్నారు. ఎన్నికల సందర్భంగా అల్లర్లు, గొడవలకు పాల్పడితే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. సీఐ వెంట ఎస్ఐ రాంమోహన్‌రెడ్డి, పోలీసు సిబ్బంది ఉన్నారు.



ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తున్న సీఐ జయచంద్ర

సంజామల: ప్రతి ఒక్కరు చట్టాలను గౌరవించాలని, ఉల్లంఘిస్తే కఠిన చర్యలు ఉంటాయని సీఐ హెచ్చరించారు.మంగళవారం నొస్సం గ్రామంలో ఎస్ఐ రమేష్ రెడ్డితో కలసి సీఐ పర్యటించారు. సీఐ మాట్లడుతూ గ్రామంలో మూడు పోలింగ్ కేంద్రలు ఏర్పాటు చేశామని, ఎవరికీ బయపడకుండా ఓటు హక్కును వినయోగించుకోవాలని ప్రజలకు సూచించారు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి అండగా నిలువాలి



పాతపేటలో ప్రచారం చేస్తున్న మహిళా కౌన్సిలర్లు

డోన్ : ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాల ద్వారా మేలు చేకూర్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి ప్రతిఒక్కరూ అండగా నిలువాలని వైఎస్సార్‌సీపీ మహిళా కౌన్సిలర్ టమటం లక్ష్మి కోరారు. పట్టణ పరిధిలోని పాతపేటలో కౌన్సిలర్లు సుకన్య, బోయ సుమలత, మిట్టా ఉమామహేశ్వరి, బుర్రురమాదేవి, మౌళాభి, మాబున్ని, పాలుట్ల మీనాక్షి, వెంకటేశ్వరమ్మ, కళావతితో కలిసి ఆమె ఎన్నికల ప్రచారం చేశారు. ప్రజల వద్దకే పాలన కొనసాగించేందుకు మరోమారు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని ప్రజలను కోరారు. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి, పోచా బ్రహ్మనందరెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని విన్నవించారు.

నేడు ఎమ్మెల్యే కాటసాని నామినేషన్

బనగానపల్లె : ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి బుధవారం బనగానపల్లె నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా నామినేషన్ వేస్తారని ఆ పార్టీ జిల్లా ప్రచార కార్యదర్శి సిద్దంరెడ్డి రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. ఉదయం 10 గంటలకు స్వగృహం నుంచి ఆర్‌ఓ కార్యాలయానికి చేరుకుని నామినేషన్ దాఖలు చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఎమ్మెల్యే వెంట కుటుంబ సభ్యులతో పాటు వైఎస్సార్‌సీపీ నాయకులు కార్యకర్తలు ఉంటారన్నారు.